క్లుప్తంగా

రసాయన వ్యవసాయం వల్ల ఖర్చుల పెరుగుదల

మొగల్తూరు: రసాయన వ్యవసాయం చేయడం వలన పంటపై ఖర్చులు పెరగడమే కాకుండా భూసారం తగ్గుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఎం నూకరాజు తెలిపారు. మొగల్తూరు సచివాలయ పరిధిలోని పడమటిపాలెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రసాయనాలతో పండించిన కూరగాయలు తినడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. రసాయన వ్యవసాయం వల్ల రానున్న రోజుల్లో పంటభూమలు బీడు భూములగా మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పడమటిపాలెం, నక్కావారిపాలెం,కోట, కుక్కలవారితోట గ్రామ సంఘాలలోని రైతులు జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలి

మొగల్తూరు: మంచినీటి ట్యాంకులను తరుచుగా శుభ్రపరుచుకోవాలని ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మంచినీటి వనరులను, ఓహెచ్ఎస్ఆర్‌లను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని కాళీపట్నం, కేపీ పాలెం, మొగల్తూరు ప్రాజెక్టుల వద్ద పంచాయతీ సిబ్బంది, ప్రాజెక్టు సిబ్బంది ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం తాగు నీరందించే మంచి నీటి ప్రాజెక్టుల్లోను, మన ఇళ్ల వద్ద నిర్మించుకున్న వాటర్ ట్యాంకులను తరుచుగా శుభ్రపరుచుకోవాలన్నారు. అంతేకాక ట్యాంకులు శుభ్రపరుచుకున్న తరువాత సూపర్ క్లోరినేషన్ చేయడంతో పాటు నీటిని పరీక్షించుకోవాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


ముదునూరితో బుడితి సుమన్

నరసాపురం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ముదునూరిని మంగళవారం పార్టీ సోషల్‌మీడియా జిల్లా కన్వీనర్ బుడితి సుమన్ ఆయన నివాసం వద్ద కలిశారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, వారి ఇబ్బందులపై పోరాటం చేసేందుకు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. అధికారం పోయిందనే నిరాశ నుంచి పార్టీ శ్రేణులు బయటకు రావాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. పేదల పక్షాన పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వల్లభాని శేఖర్ తదితరులు ఉన్నారు.

మొగల్తూరు ఎంపీడీఓగా త్రిశూల పాణి


ఎంపీడీఓ త్రిశూలపాణి

మొగల్తూరు: మొగల్తూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీహెచ్ త్రిశూల పాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా విధులు నిర్వహించిన వి.బాబ్జిరాజు కాకినాడ జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో యలమంచిలి ఎంపీడీవోగా పని చేస్తున్న త్రిశూలపాణిని మొగల్తూరుకు బదిలీ చేశారు. మొగల్తూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన త్రిశూల పాణిని కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మౌనిక, జూనియర్ అసిస్టెట్ ప్రకాష్ తదితరులు అభినందించారు.

రైల్వే లైన్ నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తి

నరసాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ సంక్షేమ, అభివృద్ధిని చేసి చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం సాయంత్రం శేరేపాలెం గ్రామంలో సర్పంచ్ తణుకుల మునేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాటాడుతూ నరసాపురం నుంచి మొగల్తూరు, బంటుమిల్లి మీదుగా మచిలీపట్నం వరకూ రైల్వే లైన్ నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా పని చేస్తున్నట్లు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

పెనుగొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం కరుగోరుమిల్లిలో నిర్వహించిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అందిస్తున్న నిధులను వివరించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలందరూ కూటమి ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వంగా చెబుతున్నారన్నారు. ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష బాబు, సర్పంచ్ అల్లం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆ చెత్త మాకొద్దు బాబూ

- నరసాపురం పట్టణ చెత్త రుస్తుంబాద మండవారి గర్వు ప్రాంతంలో డంపింగ్
- డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రుస్తుంబాద మండవారి గర్వు గ్రామస్తులు (ఫైల్)

నరసాపురం రూరల్: నరసాపురం మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తవేసే డంపింగ్ యార్డు సమీప గ్రామమైన రుస్తుంబాద మండవారి గర్వులో ఏర్పాటు చేసే ప్రతిపాదనను ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికల ముందు నుంచి ఈ అంశంపై ప్రతి ఒక్కరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు సమస్య ముదురి పాకాన పడటంతో ప్రజలంతా రోడ్డెక్కారు. మండవారి గర్వులో 5 గ్రామాలకు సంబంధించిన మంచినీటి ప్రాజక్టు ఉంది. ఈ గ్రామం జలవనరులున్న గ్రామం. చెరువులు, పంటచేలు, పంట కాలువలతో కనిపిస్తోంది. మున్సిపాలిటీ చెత్తంతా ఇక్కడ వేస్తే తాగటానికి మంచినీరు కరువైపోతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జలవనరులున్న ప్రాంతంలో డంపింగ్ యార్డు నిర్మించకూడదని, చెత్త వేయకూడదని భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ దానిని పరిశీలనలోకి తీసుకోకుండా కొందరి స్వార్ధం కోసం మా గ్రామాన్ని బలి చేస్తున్నారని మండిపడుతున్నారు. తమ ప్రాంతంలో డంపింగ్ ఏర్పాటు చేస్తే తామంతా ఆత్మహత్య చేసుకుంటామని పురుగుమందు డబ్బాలతో గత రెండు రోజుల క్రితం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి హెచ్చరించారు. పట్టణంలోని చెత్త మా కొద్దు, వ్యవసాయం ముద్దంటూ నినాదాలు చేశారు. రెండు పంటలు పండే భూములను డంపింగ్ యార్డుకు వినియోగించడం ఏంటి? అని ప్రశ్నిస్తున్నారు. రైతుల శ్రేయస్సును చూడాల్సిన అధికారులే ఇలా డంపింగ్ యార్డు కోసం స్థల సేకరణ చేయడం ఎంత వరకూ సమంజసం? అని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



నాకు డంపింగ్‌యార్డుకు కేటాయిస్తున్న స్థలం పక్కనే అరెకరం పొలం ఉంది. ఉన్న కొద్దిపొలం కూడా సాగుకు పనికి రాకుండా పోతుంది. ప్రభుత్వం వ్యవసాయం చేసుకునే భూమిని ఇలా వినియోగించడం సరికాదు. ఈ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి.

– మండ వెంకటలక్ష్మి, మండవానిగర్వు

డంపింగ్ అడ్డుకుంటాం



రుస్తుంబాదా మండవానిగరువు ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్ కోసం స్థల సేకరణ చేసి ఇప్పు డిలా డంపింగ్‌పెడ తానని ప్రభుత్వా ధికారులు, ప్రజా ప్రతినిధులు ఇలా మోసం చేయ డం సమంజసం కాదు. మా ప్రాణాలు పోయినా డంపింగ్‌యార్డును మా ప్రాంతంలో ప్రారంభం కానివ్వం.

– యర్రంశెట్టి సీతామహాలక్ష్మి, మండవానిగర్వు

పట్టణంలోని చెత్త మాకొద్దు



మున్సిపాలిటీ పరిధిలోని చెత్తనంతటినీ డంపింగ్‌యార్డుపేరుతో మా ప్రాంతంలోకి తరలించడం తగదు. రైతులను మభ్య పెట్టి మా గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మిస్తామని భూములు సేకరించారు. అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మా మొర ఆలకించి డంపింగ్ యార్డు నిర్ణయాన్ని విరమించుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నాయకర్ డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని పున సమీక్షించుకోవాలి.

– గన్నాబత్తుల వెంకటరమణారావు, మండవానిగర్వు

ప్రభుత్వ భూములున్నాయి కదా



ప్రభుత్వ భూములుండగా మాగ్రామంలో భూములు కొనుగోలు చేసి డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడం అవసరమా? భూముల కొనుగోలులో కమీషన్లు కొట్టేసేందుకే ఈ పన్నాగం. ఎట్టి పరిస్థితుల్లోనూ మా గ్రామంలోడంపింగ్‌యార్డు చేయనివ్వం.

– కవురు సాయిబాబు, మండవానిగర్వు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

పాలకొల్లు సెంట్రల్: మార్కెట్లో ఏ వస్తువు డిమాండ్ ఎక్కువగా ఉందో తెలుసుకుని ఆ వ్యాపారం దిశగా నూతన పారిశ్రామిక వేత్తలు అడుగులు వేయాలని కళాశాల ప్రిన్సిపాల్ పి శోభారాణి అన్నారు. మంగళవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్ఓ సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ కార్మిక సంస్థ ద్వారా వ్యవస్థాపకత అభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ ఏదైనా వ్యాపారం చేసుకుంటే పెట్టుబడి నిమిత్తం రుణ సౌకర్యాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, ఐఎల్‌వో మాస్టర్ ట్రైనర్ పుల్లూరు హేమాద్రి పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాల విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల్లో నైపుణ్యత పెరగడానికి ప్రతీ అంశంపైన అవగాహన ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఇంట్రడక్షన్ పోగ్రాం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఆగష్టు 28 నుంచి సెప్టెంబర్ 24 వరకూ విద్యార్థులకు 21 రోజుల పాటు ఇంట్రడక్షన్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే


ఎన్ఎస్ఎస్ డే వేడుకలో మాట్లాడుతున్న నూలి శ్రీనివాస్

నరసాపురం: ఎన్ఎస్ఎస్ అంటే సామాజిక సేవకు పెట్టింది పేరని బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఎన్ఎస్ఎస్‌లో చేరాలన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా సేవలందించడం ద్వారా చిన్నతనం నుంచి సేవా దృక్పథం పెరుగుతాయని అన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి కె.రజనీ కుమారి ఏడాదిలో ఎన్ఎస్ఎస్ ద్వారా చేసిన కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మధుశాలిని, కె.రాధామనో తదితరులు పాల్గొన్నారు.

వైఎన్ కళాశాలలో..

వైఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డేను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు అధ్యక్షతన సభ నిర్వహించారు. 1969లో ప్రారంభమైన జాతీయసేవా పథకం ద్వారా నేటికీ సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం రామకృష్ణ, హెచ్ఆర్డీ సెంటర్ డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ యాకోబ్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర కళాశాలలో..

నరసాపురం రూరల్: చదువుకునే దశలోనే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా సేవా గుణాన్ని అలవర్చుకోవడం విద్యార్థిబంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తుందని పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్‌వి సత్యనారాయణ మూర్తి (బాబ్జి) అన్నారు. మంగళవారం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, డైరెక్టర్ అద్దాల శ్రీహరి, కోశాధికారి కొండవీటి త్రినాథ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ గోపీచంద్, హెచ్ఓడీ డాక్టర్ వి.స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కంటి పరీక్షలు


మునిసిపల్ కార్యాలయంలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భీమవరంకు చెందిన మాక్సి విజన్ ఐ హాస్పటల్ వైద్యులు పారిశుద్ధ్య కార్మికులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారధి మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక్కరూ పరిశరాలను పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తద్వారా మంచి ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటుచేసుకోగలమని తెలిపారు. మాజీ కౌన్సిలర్లు పెచ్చెట్టి బాబు, జివి, శానిటరీ సెక్రటరీ హరికృష్ణ, మాక్సి విజన్ వైద్య బృందం పాల్గొన్నారు.

వడలిలో..

పెనుగొండ: స్వచ్ఛత హీ సేవ -2024లో భాగంగా వడలి పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తాగునీటి పరీక్షలు, నీటి వనరులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించిన క్యూఆర్ కోడ్‌లో ప్రజలు సూచనలు, సలహాలు అందించాలని సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలపన నరేష్, మేకా శివయ్య, కె.శ్యాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

నరసాపురం రూరల్: మండంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్రఖ్యాత సాఫ్టవేర్ కంపెనీ కోడ్ ట్రీ లో ఉద్యోగాలు లభించాయి. ఈవిషయాన్ని మంగళవారం కళాశాల యాజమాన్యం విలేకర్లకు తెలిపింది. కళాశాలలోని సీఎస్ఇ విభాగానికి చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు కోట సాయి దుర్గా రుద్రాక్ష, వివి శ్రీమన్నారాయణరెడ్డి, ఆర్ చరణ్ తేజ, నూకవరపు భాగ్యరాము, టి వనజాప్రియ లు ఉద్యోగాలు పొందారన్నారు. వీరందరినీ కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాద్, అద్దాల శ్రీహరి, ప్రిన్సిపాల్ ఎస్ సురేష్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ గోపీచంద్, సియస్ఇ విభాగాధిపతి పి శ్రీనివాసులు, పి శ్రీనివాసరావు, వివిధ విభాదిపతులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు.

అట్టహాసంగా స్కూల్ గేమ్స్ పోటీలు


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

యలమంచిలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగంలో పాలకొల్లు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు మంగళవారం మేడపాడు హైస్కూల్లో అట్టహాసంగా జరిగాయి. అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, చదరంగం, యోగా పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలో 32 పాఠశాలల నుంచి సుమారు 350 విద్యార్థినీ, విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అండర్-14 అండర్-17 బాలురు, బాలికల విభాగాల నుంచి వాలీబాల్‌లో (జట్టుకు 12 మంది చప్పున) నాలుగు జట్లకు 48 మందిని, అదే విధంగా కబడ్డీలో కూడా 48 మందిని, చదరంగం, యోగాలో కూడా ఒక్కో విభాగానికి ఐదుగురు చొప్పున నాలుగు విభాగాలకు 20 మందిని మొత్తం 136 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఫెడరేషన్ పాలకొల్లు నియోజకవర్గ కార్యదర్శి రేలంగి రామకృష్ణ తెలిపారు. వీరంతా ఈ నెల 27, 28 తేదీలలో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వివరించారు. ఈ పోటీల నిర్వహణకు ఫెడరేషన్ యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాల కార్యదర్శులు యాండ్ర సత్యనారాయణ, వీరాస్వామి, శ్రీనివాస్ వ్యాయామోపాధ్యాయులు కె సురేష్, కె సత్యనారాయణ, కాసా శ్రీనివాస్, కిరణ్‌కుమార్, బొంతు కల్యాణి, వినాయక్, భాస్కర్‌లు సహకారం అందించారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: రెండు రోజులపాటు నిర్వహించే నరసాపురం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెలక్షన్లు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నరసాపురం మండలంలోని ఎల్బీచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకుల పాఠశాల నుండీ 150 మంది విద్యార్థు హాజరయ్యారు. ఈ పోటీలను ఎంఈవో పుష్పరాజ్యం ప్రారంభించారు. అండర్14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, షటిల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వ్యాయామోపాధ్యాయుడు అడపా రామకృష్ణ కన్వీనర్‌గా వ్యవహరించారు.

100 మందికి ఉచిత వైద్య పరీక్షలు

యలమంచిలి: యలమంచిలి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం కొంతేరు ఐపీసీ సంఘములో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన 100 మందికి పాలకొల్లు శ్రీ విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది కిడ్నీ, బిపి, సుగర్, జనరల్ పరీక్షలు నిర్వహించారు. శిబిర నిర్వహణకు ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ బి దేవదానం సహకారం అందించారు.

దేవీ నవరాత్రుల్లో విశిష్ట పూజలు

యలమంచిలి: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రులు సందర్భంగా అక్టోబర్ 3వ తేదీ నుంచి 13 వరకు తొమ్మిది రోజులు సాయంత్రం విశిష్ట పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నామాల సతీష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజులు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు పూజ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పూజలో పాల్గొనే భక్తులు పూజా సామగ్రి ఎవరికి వారి తెచ్చుకోవాలని ఆయన కోరారు.

స్పష్టమైన ప్రణాళికతో చదవాలి

నరసాపురం: విద్యార్థులు స్పష్టమైన ప్రణాళికతో చదివి, ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్తే విజయం సాధించవచ్చని నన్నయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ షేక్ సులేమాన్ సూచించారు. మంగళవారం వైఎన్ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ అనేది విద్యార్థి దశలో కీలకమైనదన్నారు. ఇంటర్ తరువాతే విద్యార్థి జీవితం చదువుపరంగా మలుపు తిరుగుతుందని చెప్పారు. క్రమశిక్షణ, దురలవాట్లు విషయంలో కూడా ఇంటర్ విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, హెచ్ఆర్డీ సెంటర్ డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేను వెంటనే సస్పెండ్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కాళ్ల మండలం ఏలూరుపాడులో దళిత యువజన సంఘం ఆధ్వర్యంలో పెట్టుకున్న అంబేడ్కర్ బ్యానర్‌ను తొలగించి దళితుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బ్యానర్‌ను తొలగించిన శాసనసభ్యునిపై చర్యలు తీసుకోకుండా అన్యాయాన్ని ప్రశ్నించిన దళిత నాయకులపై కేసులు పెట్టడం, గృహనిర్బంధాలు చేయడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, మానుకొండ శ్రీనుబాబు, దళితనాయకులు జల్లి శ్రీనివాస్, నాతి శ్రీనివాస్, మధు, కోట రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

పురాతన వస్తువుల సేకరణ అభినందనీయం


సమావేశంలో పాల్గొన్న యూత్‌హాస్టల్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పురాతన వస్తువులను సేకరించడం అంటే సామాన్య విషయం కాదని ఎంతో పెట్టుబడితో కూడుకున్నదని నాణేల పరిశోధకులు, చెన్నై రావినూతల సాయిశ్రవణ్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ 32వ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు ప్రదర్శించబడిన పురాతన నాణెములు, స్టాంపులు మరియు కరెన్సీ ప్రదర్శన ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిశ్రవణ్ మాట్లాడుతూ వందల సంవత్సరాల నాటి నాణేలను కూడా ప్రదర్శించడం చాలా అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సీవీవీ సత్యనారాయణమూర్తి, కారుమూరి సూర్యనారాయణ, కొట్టి బాస్కరరావు, పీఎల్ నారాయణ, కారుమూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

యలమంచిలి: అకాల వరదలకు అతలాకుతలమైన విజయవాడ ప్రజలకు బాసటగా నిలిచేందుకు మండలంలోని కట్టుపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ముందుకు వచ్చారు. బాధితులకు సహాయం అందించమని గ్రామ ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. విద్యార్థులు రెండు రోజుల వ్యవధిలో రూ. 24,321 వసూలు చేసి ఆదర్శంగా నిలిచారు. తాము సేకరించిన విరాళాలను మంగళవారం పాఠశాల ఆవరణలో గ్రామ పెద్దల సమక్షంలో ప్రధానోపాధ్యాయుడు గోటేటి వెంకట శేషసాయికి అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారిని ప్రోత్సాహించిన ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసన్న, సోమంచి శ్రీనివాస శాస్త్రి, చల్లా లక్ష్మీ ప్రసాద్, ఐవీఎల్ కుమారిలను పలువురు అభినందించారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి


మొగల్తూరు: వరిచేలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు


పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో ఎలుకల బొరియలను పూడుస్తున్న రైతులు

మొగల్తూరు: నాణ్యమైన విత్తనాలు వినియోగంచడం ద్వారా అధిక దిగుబడి సాదించవచ్చని మండల వ్యవసాయాధికారి అబ్దుల రహమ్ సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొగల్తూరు సచివాలయ పరిధిలోని నక్కావారిపాలెం, ఇంజేటివారి పాలెం ప్రాంతాలలోని వ్యవసాయ భూములను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను రూపొందించాయన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని బుధవారం చేపడుతున్నామని రైతులంతా పాల్గొనాలన్నారు. ముందుగా ఎలుకల బొరియలను గుర్తించి మరసటి రోజున ప్రభుత్వం ఉచితంగా అందించే బ్రోమోడయోలిన్ మందును ఆ బొరియల్లో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, వెటర్నరీ డాక్టర్ నీలిమ, నీటిపారుదల శాఖాధికారి మనోహర్, రైతులు గూడూరి మావుళ్ళు, చింతన్న, కుక్కల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగు వ్యయాన్ని తగ్గించుకోవాలి

పాలకొల్లు అర్బన్: సాగు వ్యయాన్ని తగ్గించి అధిక దిగుబడులు సాధించే సూక్ష్మ ప్రణాళికల పట్ల రైతులు అవగాహన కల్పించుకోవాలని ఏడీఏ అద్దాల పార్వతి సూచించారు. పాలకొల్లు మండలం లంకలకోడేరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 24, 25వ తేదీల్లో చేపట్టే సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల పొలంలో తెరచి ఉన్న ఎలుకల కన్నాలను ఏడీఏ పార్వతి దగ్గరుండి పూడ్పించారు. సర్పంచ్ చొప్పల రజని అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఆకుల ధనలక్ష్మి, వ్యవసాయాధికారి కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకు ఎండు తెగులును నివారించాలి

యలమంచిలి: వరి వ్యవసాయ క్షేత్రాలలో లా బాక్టీరియా (ఆకు ఎండుతెగులు) లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని ఈ తెగులు నివారణకు రైతులు కృషి చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు కోరారు. గుంపర్రు, దొడ్డిపట్ల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉండి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ డెబోరా మెస్సి, డాక్టర్ వినయలక్ష్మి పొలాల క్షేత్ర పరిశీలన చేసి ఆకు ఎండు తెగులు గుర్తించారు. ఈ తెగులు నివారణకు ముందుగా పొలాల్లో నీరు నిల్వ ఉంచరాదని, ఆరగడుతూ, మరల నీళ్లు పెడుతూ ఉండాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి మాట్లాడుతూ పంట నష్ట పరిహారం హెక్టారుకు 25వేల వరకు పెంచినట్లు చెప్పారు ఈ సందర్భంగా రైతులు మురుగు డ్రెయిన్ల పూడుకు పోవడం వల్ల ప్రతి సార్వా పంటకు తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. పూడిక పనులు చేపట్టి రైతులను ముంపు నుంచి ఆదుకోవాలని కోరారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి పశుపోషణపై రైతులకు సూచనలు ఇచ్చారు.

వడలిలో

పెనుగొండ: మండలంలోని వడలి, పెనుగొండల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు రైతులకు సూచనలను, సమాచారాన్ని అందించి రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెలిచేటి బాబూరాజేంద్ర ప్రసాద్, వ్యవసాయాధికారి పి స్పందన, వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఉప సర్పంచ్ వలపన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ ఆలయ ఈఓ బదిలీ

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ ఈఓ విధులు నిర్వహిస్తున్న డి.రామకృష్ణంరాజును బదిలీ చేస్తూ దేవదాయ శాఖ కమీషనర్ ఎస్.సత్యనారాయణ జారీ చేసిన ఉత్వర్వులు అందినట్లు ఈఓ రామకృష్ణంరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. తనను భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ చేశారని పేర్కొన్నారు. కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్‌ను బండి ముత్యాలమ్మ దేవస్థానానికి బదిలీ చేశారు.